విలేకరి ముసుగులో అర్చకుడికి శఠగోపం

- ఎస్సారెస్పీలో పోయిన భూమి పట్టా చేయిస్తానని రూ.31.50 లక్షలు వసూలు
- నకిలీ ప్రొసీడింగ్ చేతిలో పెట్టిన ఘనుడు
- విసిగి వేసారి పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

ఫోన్‌పే లావాదేవీలను చూపుతున్న అర్చకుడు రాజమల్లయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి 18: విలేకరి ముసుగులో ఓ వ్యక్తి అర్చకుడికి శఠగోపం పెట్టిన ఉదంతం ఇది. బాధితుడి కథనం ప్రకారం.. మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన వైరాగ్యపు రాజమల్లయ్య అనే అర్చకుడు మానకొండూర్ మండలంలోని గట్టు దుద్దెనపల్లి, ఊటూరు, పచ్చునూరు గ్రామాలు, శంకరపట్నం మండలంలోని చింతగుట్ట గ్రామంలో పౌరోహిత్యం చేస్తూ కుంటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అలాగే ఇతడికి పచ్చునూర్‌లో 7 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, అందులో ఎకరం భూమి కొంత కాలంగా పహాణీకి రావడం లేదు. కాగా, 2023లో శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన మాచర్ల రాజయ్య అనే వ్యక్తి తల్లి దశ దిన కర్మ పూజ నిర్వహించిన సందర్భంలో హాజరైన అర్చకుడితో పరిచయం పెంచుకున్నాడు. రాజమల్లయ్యతో పహాణీకి రాని మీ భూమిని రికార్డుల్లోకి ఎక్కిస్తానని నమ్మబలికి అధికారుల ఖర్చుల పేరిట రూ. లక్షకు పైగా వసూలు చేశాడు. రెవెన్యూ అధికారులు ప్రొసీడింగ్ జారీ చేశారని ఓ నకిలీ జిరాక్స్ పత్రాన్ని చేతిలో పెట్టాడు. ఇదే క్రమంలో ఎస్సారెస్పీ కెనాల్ కింద పోయిన వ్యవసాయ భూములకు ప్రభుత్వం భారీగా పరిహారం చెల్లిస్తుందని, ఈ లెక్కన మీకు రూ. 96 లక్షల వరకు పరిహారం వచ్చేలా తనకు ఉన్నతాధికారులతో ఉన్న పరిచయాల ద్వారా పని చేసి పెడతానని అర్చకుడికి ఆశ చూపాడు. పూర్తిగా నమ్మిన రాజమల్లయ్య అధికారులకు ముట్టజెప్పాలని కోరగా, మే 2023 నుంచి డిసెంబర్ 2024 వరకు రాజయ్య అకౌంటుకు విడుతల వారీగా ఫోన్ పే, గూగుల్ పే, తదితర అకౌంట్ల ద్వారా రూ. 31.50 లక్షల వరకు చెల్లించాడు. భూమి పట్టా, పరిహారం కోసం ఎంతో కాలం వేచి చూసినా అర్చకుడి ఏ ఒక్క పనీ పూర్తి కాలేదు. అడిగితే కాన్ఫరెన్స్ కాల్స్ ద్వారా అధికారులతో మాట్లాడిస్తున్నట్లు, వివిధ దశల్లో పని ఉందని, నకిలీ పత్రాలతో నమ్మిస్తూ కాలం గడిపాడు. చివరకు తను మోసపోయానని గ్రహించిన రాజమల్లయ్య పెద్ద మనుషుల సాయంతో గట్టిగా నిలదీయగా.. డబ్బులు తిరిగి ఇస్తానంటూ ఓ తెల్ల కాగితంపై రాసి చేతిలో పెట్టాడు. ఎన్ని వాయిదాలు గడుస్తున్నా రేపు మాపు అంటూ కాలం వెల్లబుచ్చడమే కానీ అర్చకుడి డబ్బులు మాత్రం తిరిగి ఇవ్వలేదు. అతన్ని గుడ్డిగా నమ్మి మోసపోయిన అర్చకుడు చివరకు మంగళవారం కేశవపట్నం పోలీసులను ఆశ్రయించాడు. తాను తెలిసిన వారి వద్ద అప్పులు తెచ్చిన డబ్బులు రాజయ్యకు ఇచ్చానని, నమ్మితే విలేకరి ముసుగులో తనను నిలువునా ముంచాడని బోరున విలపించాడు. తనకు న్యాయం చేసి తన డబ్బులు తిరిగి ఇప్పించకపోతే తనకు చావే గతి అని వేడుకుంటున్నాడు.

పోలీసుల కస్టడీలో భూ ఆక్రమణ నిందితులు

నిందితుల ఇళ్లల్లో తనిఖీ చేసేందుకు వెళ్తున్న పోలీసులు

రాంనగర్, ఫిబ్రవరి 18: కరీంనగర్ కట్టరాంపూర్‌కు చెందిన సర్వేనంబర్ 954లో నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి తప్పుడు హద్దులు చూపుతూ పలువురికి విక్రయించిన ఘటనలో 13 మందిపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. కాగా, వారిలో ప్రధాన నిందితులైన నలుగురిని ఈ నెల 14వ తేదీన అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు. అయితే ఈ కేసుకు సంబంధించిన మరింత సమాచారం సేకరించేందుకు అందులో ముగ్గురు నిందితులు బల్మూరి రమణారావు, గణేశ్ నగర్‌కు చెందిన దాసరి సంజీవ రెడ్డి, క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్‌ను మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకున్నారు. నిందితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి ఈ కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నారు.

బల్దియాలో ప్రమోషన్ల తీరుపై విమర్శలు

- గత మూడేళ్లలో 15 మందికి ఉద్యోగోన్నతులు
- సీనియార్టీని పాటించలేదని సిబ్బంది ఫిర్యాదులు
- ఇటీవలే ఓ ఉద్యోగి సస్పెండ్
- పూర్తిస్థాయిలో విచారణ చేయాలంటున్న ఉద్యోగులు

కార్పొరేషన్, ఫిబ్రవరి 18: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇన్నాళ్లూ సాగిన ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాల విషయంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరపాలక సంస్థలో ఎప్పుడూ లేని విధంగా గత మూడేళ్లల్లోనే పెద్ద సంఖ్యలతో కారుణ్య నియామకాలు జరుపడంతో పాటు, ఏకంగా కింది స్థాయిలోని 15 మంది సిబ్బందికి ప్రమోషన్స్ ఇవ్వడంపై కూడా పలువురు సిబ్బంది నుంచి ఇప్పటికే సీడీఎంఏకు సైతం ఫిర్యాదులు అందాయి. కాగా, ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా పలువురు సిబ్బందికి రెగ్యులర్ పోస్టింగ్‌లు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న విషయంలో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలోని ఓ ఉద్యోగిని నగరపాలక అధికారులు సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో గతంలో చేపట్టిన ఉద్యోగోన్నతులు, వివిధ నియామకాల విషయంలోనూ ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేసి తమకు న్యాయం చేయాలంటూ పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

ఉద్యోగోన్నతులపై ఫిర్యాదులు

నగరపాలక సంస్థలో గత మూడేళ్లలో చేపట్టిన ఉద్యోగోన్నతుల్లో అనేక అక్రమాలు సాగాయంటూ గతంలో, ఇటీవల కూడా పలువురు ఉద్యోగులు ఆర్‌డీఎం, సీడీఎంఏలకు ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా ఓ విభాగంలోని ఉన్నతాధికారి, వారికి అనుకూలంగా వ్యవహరించే ఉద్యోగులు కలిసి తప్పుడు రిపోర్టులతో పదిహేను మందికి పైగా ఉద్యోగోన్నతులు ఇచ్చారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీని వల్ల అన్ని అర్హతలు, అన్ని సర్టిఫికెట్లు కూడా ఉండి తాము ఉద్యోగోన్నతికి నోచుకోకపోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఆయా ఉద్యోగోన్నతులు కల్పించిన సమయంలోనూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు.

కారుణ్య నియామకాలపైనా..

నగరపాలక సంస్థలో కారుణ్య నియామకాలపై కూడా విమర్శలు వస్తున్నాయి. కరీంనగర్ నగరపాలక సంస్థలో ఎనిమిదేళ్ల క్రితం నాటి ఉన్నతాధికారులు కారుణ్య నియామకాల్లో డిగ్రీ, పీజీ చేసిన వారికి అటెండర్ స్థాయిలోనే పోస్టింగ్ ఇచ్చారు. అనంతరం వచ్చిన అధికారులు మాత్రం ఆయా అభ్యర్థుల విద్యార్హత స్థాయిని పరిగణనలోకి తీసుకొని జూనియర్ అసిస్టెంట్ పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పుడు కల్పిస్తున్న ఉద్యోగోన్నతుల్లో తాము అన్యాయానికి గురవుతున్నామని, గతంలో కారుణ్య నియామకాల్లో పోస్టింగ్ పొందిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని అర్హతలున్నా, బల్దియాలో ఖాళీలు ఉన్నా కూడా రోస్టర్ రిజిస్టర్ పాటించడం లేదని పేర్కొంటున్నారు. కొంత మంది ఇటీవల ఇతర రాష్ట్రాల యూనివర్సిటీల డిగ్రీ పట్టాలు సమర్పించి ఉద్యోగోన్నతులు పొందారని విమర్శిస్తున్నారు. నిబంధనల మేరకు ఇతర రాష్ట్రాల డిగ్రీలు చెల్లకపోయినా కూడా ఓ ఉన్నతాధికారి, వారి అనుకూల ఉద్యోగులు తమ ఇష్టం వచ్చినట్లుగా ఉద్యోన్నతులు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. నియామకాల్లో అక్రమాలు చేస్తున్నారని కిందిస్థాయి ఉద్యోగిని సస్పెండ్ చేసిన అధికారులు.. అసలు అందులో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ చేస్తే పైస్థాయి అధికారుల బండారం కూడా బయటపడుతుందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఎస్టాబ్లిష్‌మెంట్‌లో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

శంకరపట్నం, ఫిబ్రవరి 18: ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ ఉత్పాదక రంగాలను ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని విస్మరించిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చేలా క్రమంగా నిధుల్లో కోత పెడుతున్నారని విమర్శించారు. రానున్న ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. లౌకిక శక్తులను గెలిపించాలని ఓటర్లను కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శి వెల్మరెడ్డి రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు పిట్టల తిరుపతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

శంకరపట్నం, ఫిబ్రవరి 18: ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజల పక్షాన తప్పక పోరాడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. 14 నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది శూన్యమని విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హామీలకు చేతలకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. పాలన, అధికార యంత్రాంగంపై సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ పట్టు సాధించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరి దారి వారిదే అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా మేల్కొని నిర్దిష్ట రాజకీయ విధానాలతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన పాలనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, నాయకులు పిట్టల రామస్వామి, తాడవేని రవి, గోదారి లక్ష్మణ్, ఆరెపల్లి తిరుపతి పాల్గొన్నారు.

నూతన పోస్టాఫీస్ చట్టాన్ని రద్దు చేయాలి

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పోస్టాఫీస్ ఉద్యోగులు

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 18: పోస్టల్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పోస్టల్ ఉద్యోగులు మంగళవారం పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. 2023 పోస్టాఫీస్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, తమ న్యాయమైన డిమాండ్లను కేంద్రప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తపాలా శాఖలో నూతన సంస్కరణల వల్ల తపాలా వ్యవస్థ నిర్వీర్యం కాబోతున్నదని, ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2023 పోస్టాఫీస్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, పోస్టాఫీస్ ఉద్యోగులు, పెన్షనర్లు, పాల్గొన్నారు.

యునెస్కో సదస్సుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్

ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 18: ఈనెల 24 నుంచి 26 వరకు ప్యారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో జరిగే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ సిల్వర్ జూబ్లీ సదస్సుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఎంపికయ్యారు. సదస్సులో ప్రొఫెసర్ మల్లారెడ్డి పాల్గొనడానికి నిర్వాహకులు ఆహ్వానం పంపినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పీ ఇందిరాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్ తరహాలో భారతీయ భాషల కోసం యూనిఫైడ్ లాంగ్వేజ్ ఇంటర్ ఫేస్ ఏర్పాటు ఆవశ్యకతను ఈ సదస్సులో ప్రొఫెసర్ మల్లారెడ్డి వివరించనున్నారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి ఎంపికపై ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. సురేందర్ రెడ్డి, ఎస్ఆర్ఆర్ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ కే లింగారెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రేణుక, స్టాఫ్ సెక్రటరీ నరేందర్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ సిబ్బందికి నైపుణ్య శిక్షణ

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 18: ఆర్టీసీ సిబ్బందికి పని విధానంలో మెరుగైన నైపుణ్యం కోసం డిపో-2లో డీఎం మల్లయ్య ఆధ్వర్యంలో, బస్టాండ్‌లోని సమావేశం మందిరంలో డీఎం విజయమాధురి ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ అండ్ వైస్ చైర్మన్ వీసీ సజ్జనార్ వీడియా కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందితో మాట్లాడారు. వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. సంస్థ ఆర్థికాభివృద్ధి గురించి వివరించారు. సిబ్బంది సంక్షేమ కోసం రీజియన్ పరిధిలో అధికారులు తీసుకుంటున్న శ్రద్ధపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలను పర్యవేక్షించిన ఆర్ఎం రాజు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాదతో నడుచుకోవాలని సూచించారు. ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పని చేయాలన్నారు. శిక్షణ ద్వారా పనిలో నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ. సిబ్బంది పాల్గొన్నారు.

21న జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 18 : జిల్లా స్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ ఎంపిక పోటీలను ఈనెల 21న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చల్ల హరిశంకర్, ఎండీ యూనిస్‌పాషా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో స్టేడియంలో రిపోర్ట్ చేయాలన్నారు. ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈ నెల 28 నుంచి మార్చి 1 వరకు సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా కార్యదర్శి ఎండీ యూనిస్‌పాషా 9866834675 సెల్ నంబర్‌లో సంప్రదించాలని ఓ ప్రకటనలో కోరారు.